విద్యార్థుల సంఖ్యే లక్ష్యంగా

బడిబాట నిర్వహించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించిన కల్టెకర్ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో విస్తృత ప్రచారం నిర్వహించి బడి ఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులు పెంచాలన్నారు. జిల్లాలో మొత్తం 450 పాఠశాలు ఉండగా అందులో 34 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు గతేడాది కాలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన జరుగుతుందని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 6వతేదీ నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించి బడిబాట ర్యాలీలు నిర్వహించాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా విద్యార్థులను పండుగ వాతావరణంలో ఆహ్వానించాలన్నారు. బడిబాటలో నమోదైన విద్యార్థుల వివరాలు ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండల, జిల్లా స్థాయి ఇన్‌చార్జిలను నియమించుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీ బడిబాట డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజేందర్, డీఆర్డీఓ బాలకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


బొగతను సందర్శించిన కేంద్ర అధికారి



బొగత వద్ద జాయింట్ సెక్రటరీ ప్రీథుల్ కుమార్

వాజేడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ నయాగర జలపాతమైన బొగతను కేంద్ర మంత్రిత్వ శాఖ ఐ అండ్ బీ జాయింట్ సెక్రటరీ ప్రీథుల్ కుమార్ గురువారం సందర్శించారు. జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ఆయన బొగత అందాలకు ఫిదా అయ్యారు. బొగత జలపాతానికి సంబంధించిన విశేషాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పాల్గొని బ్రోచర్‌ను అవిష్కరించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ కుమారస్వామి, ఎఫ్ఎస్‌వో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపోరుకు పార్టీలు రెడీ



- స్థానిక ఎన్నికల ఊహాగానాలతో వేడెక్కుతున్న వాతావరణం
- ఆధిపత్యం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కసరత్తు
- ఇప్పటికే కార్యచరణ ప్రారంభించిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు
- సంస్థాగత సమస్యల్లో బీజేపీ

భూపాలపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో జిల్లాలో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు గురువారం సాయంత్రం రాష్ట్ర మంత్రి వర్గం భేటీ కాబోతుండడంతో పల్లెపోరు తేదీలపై సర్వాత్రా ఆసక్తి నెలకొంది. వాస్తవానికి గత ఏడాది చివరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక కులగణన తర్వాత జనాభా దమాశ ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపు జరపాలన్న అంశంతో అప్పట్లో వాయిదా వేశారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వీలైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియ ముగించటం ద్వారా రాజకీయంగా మరింత పట్టును పెంచుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతున్నట్టు పరిశీలకులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి దాదాపు అన్ని కార్యక్రమాలు అమల్లోకి రావటంతో ఎన్నికలు నిర్వహిస్తే అధికార పార్టీకి లబ్ధి చేకూరుతుందన్న భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. దానికి తోడు ప్రధాన విపక్షమైన భారత రాష్ట్ర సమితిలో అంతర్గత కుమ్ములాటలు, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో కేసీఆర్‌కు నోటీసులు, కవిత సంక్షోభం వంటి అంశాల్లో కొట్టుమిట్టాడుతున్న దరిమిలా ఆ పార్టీని రాజకీయంగా మరింత చావుదెబ్బకొట్టవచ్చన్న వ్యూహం కాంగ్రెస్ నేతల్లో కన్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే జులై మూడోవారం లేదా చివరి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు మాసానికల్లా ఎన్నిక ప్రక్రియను ముగించాలన్న యోచనలో ఉన్నట్టు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రెండు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ పట్టును మరింత పెంచుకునే దిశగా క్షేత్ర స్థాయిలోకి వెళ్లేందుకు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నాయి.

రంగంలోకి తాజా, మాజీలు...

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జోరుగా ఊహగానాలు వెలువడుతున్న నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలో తాజా, మాజీ ఎమ్మెల్యేలు రాజకీయ అస్త్ర శస్త్రాలకు పదును పెడుతున్నారు. జిల్లాలో భూపాలపల్లి, మంథని శాసన సభ నియోజకవర్గాలుండగా, భూపాపల్లిలో కాంగ్రెస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణరావు అందరి కంటే ముందుగా స్థానిక సంస్థ ల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనను జరుపుతున్నారు. అంతేకాదు ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాంతో పాటే సామాజిక మాధ్యమాలు, సామాజిక మధ్యమాల ద్వారా ప్రభుత్వ కార్యక్రమా లను విస్తృతంగా ప్రచారం చేపిస్తున్నారు. మరో వైపు ప్రత్యర్థి పార్టీని దెబ్బ కొట్టాలన్న వ్యూహంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన క్యాడర్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు ఎక్కడికక్కడా మంతనాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇటీవల విపక్ష పార్టీలకు చెందిన వందమందికిపైగా కార్యకర్తలు ద్వితీయ, తృతీయ శ్రేణినాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం ఈ సందర్భంగా ఎంతైనా ప్రస్తావనార్థం. ఇదిలా ఉంటే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి కూడా అధికార పార్టీకి ఏ మాత్రం తీసిపోకుండా నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వైఫల్యాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్‌కు సంబంధించి ముఖ్యమైన క్యాడర్ చేజారి పోకుండా వారితో ఎప్పటికప్పుడు టచ్‌లోకి వెళ్తున్నట్టు చెబుతున్నారు. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఒకింత నిస్తేజం అలుముకుందన్న వార్తలు వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక సంస్థలఎన్నికలపై ఈ ప్రభావం కనిపించకుండా చూడడం కోసం గండ్ర నేరుగా బీఆర్ఎస్ అధిష్టానంతో ఇక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీపై చాలావర్గాల్లో అసంతృప్తి ఉందని అలాంటి వర్గాలను గుర్తించి పార్టీ వైపు ఆకర్షించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా హంగు ఆర్భాటాలు లేకుండా క్షేత్ర స్థాయిలో సమర్థులను గుర్తించి వారిని మాత్రమే అభ్యర్థులుగా ఎంపిక చేసేలా కసరత్తును జరుపుతున్నట్టు చెప్పుతున్నారు. ఈ క్రమంలోనే బూత్ లెవల్ నుంచి మండల స్థాయి వరకు ఎన్నికల కమిటీలను ఏర్పాటు చేసేందుకు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నట్టు ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

బీజేపీలో నిస్తేజం..

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్రియాశీలకంగా పని చేస్తుంటే వచ్చే శాసన సభ ఎన్నికల నాటికి బలపడాలన్న వ్యూహంతో ఉన్న బీజేపీ శ్రేణుల్లో మాత్రం ఒకింత నిస్తేజం నెలకొంటుంది. పార్టీ నేతల్లో సమన్వయం లేని, జిల్లా నాయకత్వం పట్ల అసంతృప్తి గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణ సమస్యల వంటివి బీజేపీని స్థానిక సంస్థల ఎన్నికల్లో నామ మాత్రపు పాత్రకే పరిమితం చేసే ప్రమాదం పొంచి ఉందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. నియోజకవర్గంలో బీజేపీ కార్యకలపాలను పర్యవేక్షించేందుకు ఇప్పటికీ సరైన నాయకత్వం లేక పోవడం ఆ పార్టీకి సమస్యగా మారొచ్చంటున్నారు. స్థానిక సమరానికి ముహూర్తం ఖరారు అయితే రాజకీయ వాతావరణం మరింత వేడెక్కె పరిస్థితులు కన్పిస్తున్నాయి.

దశలవారీగా 'ఇందిరమ్మ' ఇళ్లు

- మొదటి విడతలో పేరురానివారు ఆందోళన చెందొద్దు
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే

గణపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లమంజూరు చేయడమే సర్కారు లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లి, బస్వరాజుపల్లి, జంగుపల్లి, వెంకటేశ్వర్లపల్లి, ధర్మరావుపేట, నగరంపల్లి, కొండాపూర్, అప్పయ్యపల్లి, సీతారాంపూర్, మైలారం, కర్కపల్లి గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడాలైన కోటగుళ్ళు, గణపసముద్రం వద్ద పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన పనులు చేపట్టారు. కొటగుళ్ళలో సాస్కిపథకం నిధులు రూ. 2.34కోట్లతో అభివృద్ధి పనులకు, గణపసముద్రం వద్ద రూ. 11.28కోట్లతో కాటేజీ, బోటింగ్, రెస్టారెంట్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని చెల్పూరులో భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి హాజరయ్యారు. పట్టాలేని ప్రతీ ఒక్కరికి పట్టాలందిస్తామని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా హౌసింగ్ పీడీలోకిలాల్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, మండలపార్టీ అధ్యక్షుడు రాజేందర్, ఓడీఎమ్ఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతులు కావాలని కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌లు అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయంలో వారు పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్‌లు లీచంద్ర, సంధ్య, యోగా ఇన్‌స్ట్రక్టర్‌లు శివకృష్ణ, హరితలు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా

భూపాలపల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి దేశంలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్‌చేస్తూ గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు జరిగాయి. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, బందు సాయిలు మాట్లాడుతూ దేశంలో దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆపరేషన్ కగార్‌తో ప్రజలు, అమాయకులు బలవుతున్నారని అన్నారు. ఉగ్రవా దులతో చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం అసమా నతలను రూపుమాపడానికి పనిచేసే మావోయి స్టులతో ఎందుకు చర్చలు జరపవద్దని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకుని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు సొత్కు ప్రవీణ్, క్యాతరాజు సతీష్, వెలిశెట్టిరాజయ్య, నేరేళ్ల జోసెఫ్, రాంచందర్, శ్రావణి, స్వరూప, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలెంవాగు ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర బృందం



ప్రాజెక్టు వద్ద అధికారులతో చర్చిస్తున్న కేంద్ర బృందం

వెంకటాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామ సమీపంలో ఉన్న పాలెంవాగు ప్రాజెక్టును కేంద్ర మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ(సెంట్రల్ నోడల్ ఆఫీసర్) ప్రీథుల్‌కుమార్ బృందం గురువారం సందర్శించింది. ఈసందర్భంగా ప్రీథుల్‌కుమార్ ప్రాజెక్టు సామర్థ్యం, నీటి విడుదల, తదితర సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాలు గడిచినా ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వనుంచి ఎన్నెకరాలకు సాగునీరు అందుతుంది, నేటికీ మెయిన్ కెనాల్ పనులు ఎందుకు పూర్తికా లేదని ప్రాజెక్టు ఎస్‌ఈ మోహన్‌రావును అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వీఆర్కేపురంగ్రామాన్ని సందర్శించిన ఆయన మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని వాడుతున్నారా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటిని తాగునీరుగా ఉపయోగించడం లేదని తెలిపారు. వేరే నీటిని వాడుతున్నట్లు తెలిపారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం కావడంతో మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట సెంట్రల్ నోడల్ ఆఫీసర్ కిరణ్, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ చరణ్, పాలెంవాగు ప్రాజెక్టు ఎస్‌ఈ మోహన్‌రావు, ఈఈ జగదీశ్, డీఈ కిషోర్, ఏఈ కార్తీక్, తదితరులు ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటాలి

- పర్యవరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ఇంచర్లలోని ఏకోపార్కులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

ములుగు రూరల్ జూన్ 5, (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల కోసం ప్రతీ ఒక్కరు చెట్లు నాటాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామంలో ఏకోపార్కులో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. శుభకార్యాల్లో కేకులు కట్ చేసి హంగామా చేసే బదులు మొక్కను నాటాలన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో వచ్చే తరం వారికి ఆక్సిజన్ పెట్టుకునే స్థాయికి వస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు ఒక్కో మొక్క నాటి పర్యవరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో డోలి శంకర్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శోభన్, ఎఫ్ఎస్‌వో రవీందర్, మమత, ఎఫ్‌బీవోలు శ్యాం సుందర్, ప్రసాద్, కిషన్ తదితరులు ఉన్నారు.



సీఆర్‌ఐ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్, మేనేజర్, షాపు నిర్వాహకులు


అందుబాటు ధరలో సీఆర్‌ఐ

నాణ్యమైన పంపులు

సీఆర్‌ఐ జోనల్ మేనేజర్ మధుసూదన్

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరలో ప్రజలకు నాణ్యమైన సీఆర్‌ఐ పంపు సెట్‌లను అందిస్తున్నామని జోనల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కేయూ క్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య ఏజెన్సీ, సీఆర్‌ఐ పంప్ షోరూమ్‌ను జోనల్ మేనేజర్ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ కీర్తి శ్రీనువాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు పంపు సెట్‌లను అందించి వారి ఆదరాభిమానాలు పొందడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. మన్నికతో ఉన్న సీఆర్‌ఐ పంపుసెట్లు వాడటం వలన విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షాపు యజమానులు కర్ర సురేందర్‌రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతి నదికి హారతి



మహదేవపూర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరి వద్ద గురువారం సాయంత్రం సరస్వతి హారతి అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మొత్తం సరస్వతి నదికి హారతి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 12 రోజుల పాటు పుష్కరాలు అయిపోయినా ఆది పుష్కరాలు అయిపోయాయని మధ్య పుష్కరాలు ఏడాది మొత్తం ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ ఏడాది చివరి 12 రోజులకు అంత్య పుష్కరాలు జరుగుతాయని అందుకే చివరి వరకు ఈ ఏడాది మొత్తం అధికారుల ఆదేశాల మేరకు ఇవ్వడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఎంబీఏ విద్యార్థి ఆత్మహత్య

● ఉప్పల్‌లో ఘటన ● లింగాలఘణపురంలో విషాదం



సాయిరాం(ఫైల్)

లింగాలఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన సోమ సాయిరాం(23) ఎంబీఏ చదువుతున్న విద్యార్థి మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు సోమ వెంకటేశ్-యాకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులుండగా పెద్ద కుమారుడు సాయిరాం రామాంతపూర్‌లోని ఆరోరా కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ఈక్రమంలో వారం క్రితం వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామం లింగాలఘణపురంనకు వచ్చిన సాయిరాం గురువారం తండ్రి వద్ద ఫీజు నిమిత్తం రూ.20వేలు వెంట తీసుకుని తన స్నేహితుడు బోయిని గణేశ్‌తో కలిసి బైక్ తిరిగి ఉప్పల్‌కు వెళ్లాడు. అక్కడ అద్దెఇంటికి చేరుకున్న ఇద్దరు స్నేహితులు రూమ్‌ను శుభ్రం చేసుకున్నారు. అనంతరం స్నేహితుడు గణేశ్ పైఅంతస్తులోని మిగతా స్నేహితులను కలిసేందుకు వెళ్లి తిరిగి కిందకు వచ్చే సరికి గదిలో సాయిరాం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎంబీఏ విద్యార్థి సాయిరాం మృతితో లింగాలఘణపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సందడిగా రెవెన్యూ సదస్సులు

మూడోరోజు సదస్సులకు భారీ సంఖ్యలో రైతుల హాజరు ● పెద్దఎత్తున దరఖాస్తుల దాఖలు



దామెర మండలం ల్యాదెల్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు మూడో రోజు గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో సందడిగా సాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో గురువారం 2,090 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ మూడురోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 4,717కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకు గాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

మూడో రోజు గురువారం భీమదేవరపల్లి మండలంలో గట్లకానిపర్తి, ధర్మసాగర్ మండలంలో ముప్పారం, ఎల్కతుర్తి మండలంలో వీరనారాయణపురం, హనుమకొండ మండలంలో లష్కర్ సింగారం, ఐనవోలు మండలంలో పంథిని, కమలాపూర్ మండలంలో అంబాల, వేలేరు మండలంలో సోడషపల్లి, కాజీపేట మండలంలో కాజీపేట, హసన్‌పర్తి మండలంలో ముచ్చర్ల, దామెర మండలంలో ల్యాదెల్ల, ఆత్మకూరు మండలంలో పెద్దాపూర్, పరకాల మండలంలో నాగారం, శాయంపేట మండలంలో నేరేడుపల్లి రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో కూడా మూడోరోజు 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. రాయపర్తి మండలంలో కేశవాపూర్, కొలన్‌పల్లి, పర్వతగిరి మండలంలో రోళ్లకల్, గోపనపల్లి, ఖిలా వరంగల్ మండలంలో రంగశాయిపేట, మామునూరు, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో కాపులకనపర్తి, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో లింగగిరి, కోనాపురం, దుగ్గొండి మండలంలో రేకనపల్లి, తొగర్రాయి, నర్సంపేట మండలంలో లక్నెపల్లి, మహేశ్వరం, మహిర, నల్లబెల్లి మండలంలో నారక్కపేట, రంగాపూర్, గీసుగొండ మండలంలో ధర్మారం, అనంతారం, నెక్కొండ మండలంలో సూరిపల్లి, చిన్నకోర్పోలు, ఖానాపురం మండలంలో ఐనపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

నేడు సదస్సులు

హనుమకొండ జిల్లాలో నాలుగో రోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరగనున్న గ్రామాలు.. భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లి.

● వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్థంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లాయగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుగొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలి, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి.

'నవ దంపతులకు ప్రధాని ఆశీర్వాదం

సంతోషం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



Prime Minister

New Delhi

30 May, 2025

Smt. Maddela Suguna Ji,

Congratulations on the wedding of Shiva Kumar with Lalitha.

May their marriage be blessed with constant joy, good health and success.

With blessings,

(Narendra Modi)

బయ్యారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బయ్యారంకు చెందిన ఓ నవదంపతులను నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో.. సంతోషాలతో జీవించాలని దీవిస్తూ ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన మద్దెల సుగుణ-శోభన్‌బాబు (లేట్) దంపతుల కుమారుడు శివకుమార్ వివాహం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సారమ్మ-సోమలింగం (లేట్) దంపతుల కుమార్తె లలితతో గతనెల మే 23న బయ్యారంలో జరిగింది. అయితే అంతకుముందు వివాహ వేడుకలో భాగంగా తన కుమారుడి వివాహానికి ఆహ్వానిస్తూ ఏప్రిల్ 20వ తేదిన శివకుమార్ తల్లి సుగుణ ప్రధాని నరేంద్ర మోదీకి శుభలేఖ పోస్ట్ చేసింది. దీంతో నవదంపతులను మోదీ ఆశీర్వదిస్తూ సుగుణ పేరు మీద గత నెల 30న ప్రధాని కార్యాలయం నుంచి లేఖ పంపించగా.. ఆ లేఖ గురువారం బయ్యారంలో ఉంటున్న మద్దెల సుగుణ ఇంటికి చేరింది. దీంతో నవదంపతులతో పాటు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తమ ఆహ్వానాన్ని స్వీకరించి మాలాంటి పేద కుటుంబ సభ్యులకు మోదీ ఆశీర్వాదం తెలపడం గొప్ప వరమని, ఇలాంటి మధురానుభూతి జీవితాంతం గుర్తుండిపోతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శ్రావణ్ (ఫైల్)

గీసుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి శ్రావణ్(40) అప్పుల బాధతో ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రావణ్ భార్య పిల్లలతో వరంగల్ కొత్తవాడలో ఉంటూ హమాలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో కొంత అప్పుచేశాడు. అయితే గురువారం గ్రామంలో చిట్టి డబ్బులు కట్టడానికి వచ్చాడు. అయితే అతని వద్ద చిట్టి డబ్బులు లేక మానసిక ఆవేదనతో మనుగొండలోని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మృతుని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

మనస్థాపంతో

గృహిణి ఆత్మహత్య



బచ్చు లక్ష్మి (ఫైల్)

ఎల్కతుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన భర్త ప్రవర్తన మారక పోవడంతో మనస్థాపానికి గురైన గృహిణి బచ్చు లక్ష్మి (48) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూరారం గ్రామానికి చెందిన బచ్చు రామారావు-లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఒక కమార్తె ఉన్నారు. ఐదేళ్ల కిందట రామారావు ఇల్లు కట్టగా అయిన అప్పును తీర్చడానికి తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మి అప్పు తీర్చారు. అప్పటి నుంచి రామారావు హనుమకొండలోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైయ్యాడు. దీనికి తోడు అప్పులు పెరిగాయి. భర్త ప్రవర్తనలో మార్పు రాదని లక్ష్మి మనోవేదనకు గురైంది. ట్రాక్టర్ పనికోసం ఇంటికి తెచ్చి పెట్టుకున్న డీజిల్‌ను బుధవారం రాత్రి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. బయట నిద్రపోతున్న భర్త రామారావుతో పాటు బంధువులు మంటలు ఆర్పి ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు రోహిత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. రైల్వే క్వార్టర్స్ సమీపంలోని రామాలయం గుడి వద్ద బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 45 - 50 ఏళ్లు ఉంటాయి. ఎత్తు 5.6 కోలముఖం, ఛామనఛాయ రంగు, బార్డర్‌గీతల షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మెడలో తెలుపు రంగు చైన్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతికి గాయమై తెలుపు పట్టి ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్నామని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు చెప్పారు.

రేపటి నుంచి దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రేచ్నిరోడ్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనులు దృష్ట్యా ఈ నెల 7 నుంచి 29 వరకు నడిచే కాజీపేట - దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 29 తర్వాత ఈ రైలు యథావిధిగా నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

ఖమ్మంలో రోడ్డు ప్రమాదం

■ తండ్రీ కొడుకుల మృతి

■ డోర్నకల్ మండలం దుబ్బతండాలో విషాదఛాయలు



లారీ బైక్‌ను ఢీకొట్టడంతో మృతిచెందిన బాల్య



అజ్మీర బాల్య (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన తండ్రీ, కొడుకులు మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన అజ్మీర బాల్య (50)-భారతి దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఏకైక కుమారుడు సాయికుమార్ (17) ఖమ్మంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో బాల్య తన కుమారుడు సాయికుమార్‌తో కలిసి గురువారం ఉదయం తమ ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వెళ్లారు. కళాశాలకు వెళ్తున్న క్రమంలో ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వారి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాల్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన సాయికుమార్‌ను 108 ద్వారా ఆస్పత్రికి తరలించగా, అతడిని పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న బాల్య భార్య భారతి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబంలో భర్త, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భారతి ఒంటరిగా మిగిలిపోయింది.

కాగా, బాల్య బీఆర్‌ఎస్ పార్టీలో నాయకుడిగా పనిచేయడంతో విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, స్థానికులు, స్నేహితులు పెద్దసంఖ్యలో ఖమ్మంకు బయలుదేరి వెళ్లారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సైతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బాల్య, సాయికుమార్ మృతదేహాల వద్ద కంటతడి పెట్టారు. పోస్టుమార్టం అనంతరం బాల్య, సాయికుమార్ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించడంతో దుబ్బతండాకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్య, సాయికుమార్ మృతదేహాలవద్ద నివాళ్లర్పించారు. అనంతరం బాల్య, సాయికుమార్‌ల అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

లిఫ్ట్ గుంతలో పడి బాలుడి మృతి



సాత్విక్(ఫైల్)

ధర్మసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలకేంద్రానికి చెందిన సుంకనపల్లి సాత్విక్ (12) అనే బాలుడు లిఫ్ట్ గుంతలో పడి బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఏఎస్సై పోచయ్య గురువారం తెలిపారు. సాత్విక్ తన స్నేహితులతో కలిసి సమీపంలో ఇదే గ్రామానికి చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ వద్దకు ఆడుకునేందుకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి బిల్డింగ్ పైన ఆడుతున్నక్రమంలో సాత్విక్ కాలు జారి లిఫ్ట్ గుంత నీటిలో పడి మునిగిపోయాడు. తోటి స్నేహితులు కొద్దిగంటల సమయం తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం తెలుపడంతో కుటుంబసభ్యులు లిఫ్ట్ గుంతలో పడిపోయిన సాత్విక్‌ను నీటిలో నుంచి బయటికి తీసి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి సాత్విక్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతి చెందిన బాలుడు నగరంలో 7వ తరగతి చదువుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-19 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన వరంగల్ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6వ తేదీ నుంచి భూపాలపల్లి, ములుగు, జనగాం, జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల స్థాయి అండర్-19 బాలుర ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ లీగ్ జట్ల తుది జాబితాను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5తేదీల్లో కరుణాపురం సమీపంలోని వంగపల్లి క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 బాలుర క్రికెట్ లీగ్ పోటీల్లో హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు మహబూబాబాద్, జనగామ జిల్లాల జట్ల మధ్య ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలో సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 6జట్లను 6జిల్లాలుగా విభజించి అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. అంతర్ జిల్లాల స్థాయిలో సుమారు 15రోజుల పాటు ఆరు జిల్లాల మధ్య ఒక్కో జట్టుకు 5మ్యాచ్‌లు నిర్వహించి, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-19 హెచ్‌సీఏ క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణగౌడ్, ఉపాధ్యక్షులు తోట రాము, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఈసీ మెంబర్ వినయ్, కోచ్‌లు ఎండీ. అఫ్జల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో 9మందిపై కేసు

వరంగల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ స్టేషన్ రోడ్డు ప్రాంతంలో గల ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో నకిలీ బంగారం పెట్టి రూ.43లక్షలు కాజేసిన తొమ్మిది మందిపై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ కేసు దర్యాప్తు అనంతరం వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో పనిచేస్తున్న బ్రాంచ్ మేనేజర్‌తో పాటు మరో ఐదుగురు బ్యాంకు సిబ్బంది, ఖాతాలు తెరిచిన ముగ్గురు కస్టమర్లు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఇతర ఐదుగురు బ్యాంకు సిబ్బంది ముగ్గురు కస్టమర్ల పేర్ల మీద ఖాతాలు తెరిచారు. ఇందులో వరంగల్ శివనగర్‌కు చెందిన సి.శ్రవణ్‌కుమార్ పేరు మీద మార్చి 17, 2025న 145 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.8లక్షలు, గుంటూరుకు చెందిన లక్ష్మీశిరీష పేరు మీద ఏప్రిల్ 22, 2025న 764 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.18.50 లక్షలు, హంటర్‌రోడ్డుకు చెందిన టి.రజిత పేరు మీద ఏప్రిల్ 24, 2025న 278గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.17లక్షలు మొత్తం రూ.43లక్షల 50వేలు తీసుకున్నారు. వీరు ముగ్గురు బ్యాంకులో డబ్బులు తీసుకున్నప్పటి నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో హైదరాబాద్ నుంచి బ్యాంకు సిబ్బంది ఆడిట్ చేయడానికి మే 23, 2025న వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు వచ్చి ఈ బ్యాంకులో ఉన్న మొత్తం బంగారాన్ని పరీక్ష చేయగా ఈముగ్గురు కస్టమర్లు పెట్టిన బంగారం నకిలీదని తేలిందన్నారు. దీంతో బ్యాంకు హెడ్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.చంద్రప్రకాశ్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నకిలీ బంగారం పెట్టిన ముగ్గురు కస్టమర్లపై ఫిర్యాదు చేశారు. సీఐ షుకూర్ దర్యాప్తు చేసిన అనంతరం ఏ1గా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఐదుగురు సిబ్బంది ఏ2 కె.రాముశర్మ, ఏ3 జీవిత్‌కుమార్, ఏ4 జి.బ్రహ్మాచారి, ఏ5 పి.రాజమౌళి, ఏ6 వి.కరుణాకర్‌లు అదేవిధంగా ముగ్గురు కస్టమర్లు ఏ7 సి.శ్రవణ్‌కుమార్, ఏ8 లక్ష్మీశిరీష, ఏ9 టి.రజితలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆఫర్‌లో తక్కువ ధరకు బైక్‌ల పేరిట మోసం

మట్టెవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పండుగ ఆఫర్ పేరిట తక్కువ రేటుకే కొత్త ద్విచక్ర వాహనాలు షోరూమ్ వాళ్లు విక్రయిస్తున్నట్లు ఒక్కొక్కరికి దగ్గర రూ.70వేలు వసూలు చేసి చేసిన ఓ వ్యక్తిపై బాధితులు గురువారం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వరంగల్ కొత్తవాడలో నివాసం ఉంటున్నాడు. దసరా పండుగ ఆఫర్ పేరుతో షోరూమ్ వాళ్లు రూ.1,10,000 విలువ చేసే ద్విచక్ర వాహనాలను రూ.70వేలకు విక్రయిస్తున్నట్లు చెప్పిన వ్యక్తి సుమారు 34 మంది వద్ద రూ.70వేలు తీసుకొని వాహనాన్ని అందజేశారు. సదరు వ్యక్తి ఫైనాన్స్ కంపెనీకి పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకుండా వాహనాన్ని కొన్న వారికి డాక్యుమెంట్లు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేశాడు. దీంతో ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాలను జప్తు చేసేందుకు రావడంతో బాధితులు ఒక్కసారిగా షాక్‌కు అయ్యారు. వీరందరికి కూడా ఎంజీఎంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా ఈ కొత్తవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి పరిచయం అయ్యాడని, స్కీంలో తక్కువ ధరకే ద్విచక్ర వాహనాలు షోరూం వాళ్లు విక్రయిస్తున్నారని చెప్పడంతో కొనుగోలు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మోసపోయిన బాధితులు ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిగా తెలిసింది. రూ.70వేలు చెల్లించిన తరువాత ఫైనాన్స్ కంపెనీ వారు ద్విచక్ర వాహనాలను ఎందుకు జప్తు చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.



వేసవి క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

క్రీడలతో విద్య, ఉద్యోగావకాశాలు

» హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య » ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ తోపాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో మే 1న ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారం ముగి శాయి. హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు వేడులకు కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏడాది కంటే ఈ ఏడు రెండింతలుగా విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. శిక్షణ శిబిరాలు విజయవంతం కావడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, డీఎస్ఏ సిబ్బంది కీలక భూమిక పోషించారని కొనియా డారు. క్రీడల వల్ల శరీర ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను మైదానాలకు పంపించి వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదు ఇప్పించాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణతో పాటు పలు విషయాలపట్ల అవ గాహన కలుగుతుందన్నారు. ఇటీవల జేఎన్ఎస్‌లో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో జిల్లాకు పెద్దఎత్తున పతకాలు వచ్చాయని కలెక్టర్ గుర్తు చేశారు. అలాగే డీఎస్ఏ ఆధ్వర్యంలోని జిమ్నాస్టిక్స్ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, మరమ్మతుల కోసం రూ.1కోటి30లక్షల నిధులు కేటాయించామన్నారు.

విశిష్ట అతిథి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం గొప్పదన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. 36 రోజులుగా జేఎన్ఎస్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 22 క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న బాలబాలికలకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో దాదాపు 2వేల మందికి పైబడి పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా జేఎన్ఎస్‌లో పలు క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడాం శాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా డీవైఎస్‌వో రఘు, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసి యేషన్ అధ్యక్షుడు బొడ్డిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యాంప్ర సాద్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్, వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు మర్కాల యాదిరెడ్డి, అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యులు కరీం, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమాన్, ఎం.డి. అఫ్జల్, పి.రమేష్, బి.జీవన్‌గౌడ్, ఆర్.రమేష్, పి.వెంకటేశ్వర్లు, బి.విష్ణు, దేవిక, శంకర్, రాజు, ప్రభుదాస్‌తోపాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

త్యాగభావమే పరమావధిగా..

'ఉన్నదొక్కటే జీవితం...
పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ..
ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యత లేదు
ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలు రద్దయ్యాయి'

ఇవీ.. దాదాపు పదిహేను వందల ఏళ్ల కిం దట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు. ఆయన ప్రసంగ పాఠం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసిం ది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవన ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్ర లో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కులను ప్రస్తావించడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా పేర్కొనవచ్చు.

» రేపే ఈద్-ఉల్-జుహా
» బక్రీద్ పర్వదినానికి సర్వం సన్నద్ధం
» ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు



మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం, రెండోది నమాజ్, మూడోది ఉపవాసం (రోజా), నాలుగోది జకాత్ (ఆర్థిక విధానం), ఐదోది హజ్ (కాబా సందర్శన యాత్ర) ఇందులో ఏ ఒక్కదాన్ని పాటిం చకున్నా అల్లాహ్‌పై విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్థోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయ డం తప్పనిసరి. ఈ ఆరాధన ముస్లింల క్యాలెండర్‌లోని జిల్ హజ్జ్ మాసంలో 10వ తేదీన సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే అంటే ఈ సారి జూన్ 7న (రేపు) ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్- ఉల్-జుహ' లేక 'బక్రీద్' లేక 'ఈదె ఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

బక్రీద్ పండుగ నేపథ్యం ..



హజ్రత్ ఇబ్రహీమ్‌కు లేక లేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీమ్ తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగం టాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంగీకరిస్తాడు. హజ్రత్ ఇబ్రహీం పుత్రవాత్సల్యాన్ని జయించి కన్న కొడుకును బలివ్వడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రాహీమ్‌లోని ప్రేమ బలిని గుర్తించి అక్కడ కొడుకు స్థానంలో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్ (బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రాహీమ్ నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బానీగా పేర్కొనే జంతు బలిదానం తెరపైకి వచ్చింది.

ఆత్మీయాదరణకు బక్రీద్ పండుగ

త్యాగబోధన పండుగ అయిన బక్రీద్ సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప భేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 8 నుంచి 9 గంటలలోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకనుగుణంగా నిర్దేశిత సమయానికి ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. అంతా కలిసి భేదభావం లేకుండా సహపంక్తిలో నిలబడి ప్రార్థన చేస్తారు. పెద్ద ఇమాంను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీ

మనిషిలోని త్యాగ బావాన్ని సజీవం, సుచేతనంగా ఉంచడానికి ప్రతీ సంవత్సరం బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఇచ్చిన ఆదేశాల అంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లింలు ఈ పండుగ నాడు జంతు బలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ మత సామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర (హజ్)ల ప్రాధాన్యం గురించి ఈద్గాల్లో ఇమామ్‌లు వివరిస్తారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు పూర్తి చేసుకున్న ముస్లింలు తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. ఆ మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగువారు, బంధుమిత్రులకు ఇవ్వాలి. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కల్గించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.


జంతు బలిదానం వెనుక పరీక్ష

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీని కోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఉటంకిస్తూ ఏటేటా బక్రీద్ రోజు జంతు బలిదానాలు నిర్వహిస్తున్నారు.

హజ్ చేయాలని సంకల్పిస్తే..

హజ్ చేయాలని సంకల్పించిన వ్యక్తి దీక్ష బూనాలి. మనసులో ఎలాంటి దురుద్దేశం లేకుండా, కీర్తి ప్రఖ్యాతలపై కోరిక ఉండకూడదని భావన. హజ్ ప్రయాణ ఖర్చులకు ఉపయోగించే డబ్బు ధర్మ సంపాదనై ఉండాలి. వడ్డీ, జూదం, లాటరీ, లంచం, మోసపూరితమైన వ్యాపారం, దొంగతనం తదితర అక్రమంగా సంపాదించిన డబ్బుతో హజ్ యాత్ర చేయడం మహా నేరమని ముస్లిం మత బోధకులు చెబుతున్నారు. ముస్లింలకు మక్కా తర్వాత మదీనా ఎంతో గొప్ప పుణ్యక్షేత్రం. హజ్ యాత్రలో మక్కాకు వెళ్లిన ప్రతిఒక్కరూ ఆ తర్వాత మదీనాకు వెళ్తుంటారు.

ఆధ్యాత్మిక యాత్ర హజ్



త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సౌదీ అరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలు మూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలి వెళ్తారు. దైవప్రవక్త ఆదేశాన్ని శిరసావహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్తంభాలైన నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), జకాత్ (దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

అభివృద్ధికి ఆమడ దూరం



నాగుర్లపల్లెలో నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

» విలీన గ్రామాల్లో సమస్యల తిష్ట
» వేధిస్తున్న సిబ్బంది కొరత
» ఉపాధి కోల్పోయిన కూలీలు
» కన్నీరు పెడుతున్న పల్లెప్రకృతి వనాలు
» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణాన్ని కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసేందుకు సమీపంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు. విలీనం చేసిన గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మౌలిక వసతులు కరువై సమస్యలు తిష్ట వేశాయి. రోడ్లు, సైడ్ కాల్వలు లేని వీధులు, తాగు, సాగునీరు, ఉపాధి పనులు వంటి సమస్యలతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు, పన్నులు పెరిగి మోయలేని భారం పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులెవరిని కదిలించినా గ్రామ పంచాయతీ పాలనలో తమ బతుకులు బాగున్నాయి.. మునిసిపాలిటీలో కలిసినప్పటి నుంచి తమను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. నర్సంపేట మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్ వైపు అడుగులు వేసేందుకు పట్టణానికి సమీపంలో ఉన్న నాగుర్లపల్లె, మాధన్నపేట, పర్శనాయక్ తండా, ముత్తోజిపేట, మహేశ్వరం, రాములునాయక్ తండా, మగ్దుంపురం, రాజపల్లె గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు.



నిధుల లేమితో నాగుర్లపల్లెలో నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణం

సమస్యలతో సతమతం

మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. పంచాయతీ పాలనలో ఉన్న కార్యదర్శులకు గ్రామాలపై అజమాయిషి ఉండగా, మునిసిపాలిటీలో విలీనంతో డ్రైనేజీ, తాగునీరు సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పైపులైన్ పనులను అర్ధాంతరంగా ముగించడంతో తాగునీటి కోసం ప్రజలు తండ్లాడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మునిసిపాలిటీలో విలీనం కావడంతో గ్రామాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయలేకపోవడంతో ప్రజలు దోమలు, మురుగు వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపాలిటీ నుంచి నెలలో ఎప్పుడు వచ్చి డ్రైనేజీలు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా చేసే పనిలో ఒక్కరే విధులు నిర్వర్తించడంతో సక్రమంగా జరగడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే మునిసిపాలిటీలో విలీనం కావడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. గతంలో ఈజీఎస్ కింద పనులు చేసి వచ్చే డబ్బులతో కుటుంబాలను వెళ్లదీసుకునేవారు. మునిసిపాలిటీలో విలీనంతో ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ కరువు

విలీనానికి ముందు ఈజీఎస్ కింద వర్కర్లు పల్లె ప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతలు చేపట్టేవారు. మునిసిపాలిటీలో విలీనంతో



సంరక్షణ కరువైన పల్లె ప్రకృతి వనం

ఈజీఎస్ ఎత్తి వేయడంతో వేతనాలు రావని తెలిసిపోయి వర్కర్లు పనుల నుంచి వైదొలిగారు. దీంతో పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ లేకుండా పోయింది.

అధికారుల నిర్లక్ష్యం

విలీన గ్రామాల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఏర్పాట్లను చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలకు తిప్పల తప్పడం లేదు. మునిసిపాలిటీలో విలీనమైతే అభివృద్ధి జరుగుతుందనుకుంటే పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



విలీన గ్రామంలో మూలన పడ్డ దోమల నివారణ పిచికారీ యంత్రం

జోసా అభ్యర్థుల కోసం ఓపెన్ హౌస్

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జాయింట్ సీట్ అలోకేషన్ ఆథారిటీ (జోసా) ద్వారా ప్రవేశాన్ని కోరుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వరంగల్ ఎన్ఐటీలోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఈనెల 9న ఓపెన్‌హౌస్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నవారికి విద్యావేత్తలు, ప్రస్తుత విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ, శాఖల ఎంపిక, సీటు కేటాయింపు, క్యాంపస్ సౌకర్యాలపై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని నిట్ వరంగల్ అధికారిక యూట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఓపెన్‌హౌస్‌కు ప్రత్యక్షంగా హాజరుకాలేని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ చానెల్ ద్వారా వీక్షించవచ్చు. నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, డీన్లు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థి ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రసంగిస్తారు. జోసా కౌన్సెలింగ్ ప్రక్రియలో అభ్యర్థులకు మార్గనిర్దేశం చేస్తారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రయోజనం పొందాలని నిట్ అధికారులు కోరారు.



వరంగల్ నిట్ పరిపాలనా భవనం

నిట్‌ను సందర్శించిన బీవోజీ చైర్మన్

» డైరెక్టర్, డీన్లతో సమావేశం
» నిట్ పనితీరుపై మోహన్‌రెడ్డి సమీక్ష

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి గురువారం నిట్‌ను మొదటిసారిగా సం దర్శించారు. డాక్టర్ రెడ్డి సయింట్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రస్తుతం ఐఐటీ హైదరాబాద్, ఐఐ టీ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ కూడా. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ రెడ్డికి నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి ఘన స్వా గతం పలికారు. నిట్‌లో విద్యాబోధన, ఇతర కార్యకలాపాలపై డాక్టర్ రెడ్డి డైరెక్టర్, డీన్లతో సమగ్రంగా చర్చించారు. అనంతరం అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో అధ్యాపకులు, పరిపాలనాధికారులతో సమావేశమై విద్యా ప్రావీణ్యం, ఆవిష్కరణలు, పరిశ్రమ-సంస్థ భాగస్వామ్యాలపై చర్చించారు. పరిశోధన గ్రాంట్ల పెంపు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, సిలబస్‌ను తాజా సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నవీకరించడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా సంస్థ పరిధిని విస్తరించాల్సిన అవసరం తదితర అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.



మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

పోలీసు ఫైల్స్!

పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

• నాలుగు రకాల సేవలకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ యాప్
• అన్ని ఠాణాల్లో ఏర్పాటైన క్యూఆర్ కోడ్ పోస్టర్లు
• ఫిర్యాదు ఎవరిదో తెలియకుండా రూపకల్పన
• పోలీసుల వ్యవహార శైలిపై సర్కారు నజర్

కృష్ణకాలనీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏదేని సమస్యతో మీరు ఠాణాకు వెళ్తున్నారా..? అయితే అక్కడ పోలీసుల తీరు ఎలా ఉంది..? మీకు ఎదురయ్యే సమస్యలపై వారు ఎలా స్పందిస్తున్నారు. ఏదైనా ఇబ్బందులు పెడుతున్నారా..? లేక ఇంకేమైనా డిమాండ్ చేస్తున్నారా..? ఇలా పోలీసుల ప్రవర్తన ఎలా ఉందనే విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రజలు చెప్పొచ్చు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయం.. మేం మీ అభిప్రాయానికి విలువ ఇస్తాం.. అనే స్లోగన్‌తో సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకరాగా.. ఇప్పటికే అన్ని ఠాణాల్లో ఈ క్యూ ఆర్ కోడ్‌లను ఆయా ఠాణాల పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.



సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ పోస్టర్

నాలుగు రకాల సేవలపై నజర్

పోలీసు అధికారుల అందిస్తున్న సేవలపై ప్రభుత్వం దృష్టి సారించిందనే చెప్పుకొచ్చు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా వినూత్న కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందులో ప్రధానంగా పోలీసులు అందిస్తున్న నాలుగురకాల సేవలపై వారి తీరు ఎలా ఉందనే విషయాన్ని తెలిపేందుకు అవకాశాన్ని కల్పించారు. వీటిలో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ-చలాన్, పాస్‌పోర్టు ధృవీకరణ, ఇతర అంశాలు అంటూ నాలుగు సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 పోలీస్‌స్టేషన్‌ల నుంచి ఇప్పటి వరకు 150 పోస్టులు వచ్చినట్లు తెలిసింది. వీటిలో దాదాపు అధికారుల పనితీరులో వారు అందిస్తున్న సేవల్లో అభినందనీయంగానే వచ్చినట్లు తెలిసింది.

నేరుగా డీజీపీ ఆఫీసుకే..

పోలీసుల తీరుపై ఫిర్యాదు చేస్తే మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే భయానికి సైతం ఆస్కారం లేదు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పోస్టు చేసిన వివరాలన్ని నేరుగా డీజీపీ కార్యాలయానికి వెళ్తోంది. ఆ ఫిర్యాదులను డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు మినహా మరెవరూ చూసే ఆస్కారం లేదని పోలీసు ఉన్నతాధికారులు చెప్పుకొచ్చారు. ఫలితంగా ఎవరు ఎలాంటి అభిప్రాయాన్ని చెప్పారనేది బయటకు తెలిసే అవకాశం ఉండదు. నిర్భయంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలతోపాటు పోలీసులు అందిస్తున్న విశిష్ట సేవలను సైతం పోస్టు చేయొచ్చు.

యాప్‌లోంచి క్యూఆర్ స్కాన్

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలంటే తొలుత సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లోంచి ప్రస్తుతం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. దీంతో మొదటగా లాంగ్వేజ్ ఆప్షన్ తదుపరి పేరు, పురుష/స్త్రీ, సెల్ నెంబర్, మెయిల్ ఐడీ, పోలీస్‌స్టేషన్ పేరుతో సహా ఇతర వివరాలు నమోదు చేసి అప్లోడ్ చేయాలి. కాగా, ఇప్పటికే అన్ని ఠాణాల్లో దాదాపు క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఠాణా ఆవరణల్లో ఈ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.

పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట

పోలీస్ శాఖలో సేవలపై చాలా మందిలో అన్యత భావన నెలకొంటుంది. ఠాణాకు వెళ్తే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు సమస్యలు మరింత జఠిలమవుతాయనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో పోలీసుల పనితీరు, వారిలోని పారదర్శకతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, సలహాలు, సూచనలతో మార్పులు, చేర్పులకు ఆస్కారం ఉండనుంది. పోలీసుల పనితీరులో మార్పు తీసుకొ చ్చే ఆలోచనలో భాగంగా సర్కారు వినూత్నంగా ఆలోచింపజేయడంపై హర్షం వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ క్యూఆర్ కోడ్ ఎలా వినియోగించాలి, ఎలాంటి ఎలా ఫిర్యాదు చేయాలనే విషయాలపై అవగాహనలు కల్పిస్తే ప్రభుత్వ ఆలోచన ఫలిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరైనా తమ అభిప్రాయాలను తెలుపొచ్చు

కిరణ్‌ఖరే, జిల్లా ఎస్పీ భూపాలపల్లి



ప్రజలెవరైనా పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలు నిర్భయంగా తెలియజేయవచ్చు. పోలీసుల నుంచి ఎదురయ్యే సమస్యలు గానీ, వారు అందిస్తున్న విశిష్ట సేవలపై గానీ ఏదైనా తెలియపర్చవచ్చు. ఇప్పటివరకైతే ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ సంతృప్తికరమైన పోస్టులు వచ్చాయి. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనతో పోలీసులు మరింత సమర్థవంతంగా పని చేసి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంపై జిల్లాలో త్వరలో విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
శుక్రవారం 6 జూన్ 2025


ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


కాటారంలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంపీవో


ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


మొక్కనాటి నీరు పోస్తున్న ఎస్‌ఓటూ జీఎం కవీంద్ర


మల్హర్ : పెద్ద తూండ్లలో..

అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు

మహదేవపూర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహదేవపూర్ జాతీయ రహదారి వెంట ఉన్న ప్లాస్టిక్ వస్తువులను సేకరించి గోనె సంచుల్లో వేశారు. ప్లాస్టిక్‌తో పర్యావరణాన్ని ముప్పు అని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో రవి, డీఆర్‌వో రాజేశ్వర్, ఎఫ్‌ఎస్‌వో వరుణ్, ఆనంద్, తిరుపతి, సుమన్ హసన్‌ఖాన్, ఫయాజ్ అహ్మద్, అఫ్జల్ , ఎఫ్‌బీవోలు సదానందం, దిలీప్, అంజయ్య, విటల్, సురేందర్, సంజీవ్, అనిల్, రాజశేఖర్, త్రివేణి, బేస క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

● మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఓసీపీ, పెద్దతూండ్లలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీ ఆవరణంలో ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి మొక్కలు నాటారు. పెద్దతూండ్లలో ఉపాధి కూలీలతో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మైన్ మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎన్వీరాన్మెంట్ ఆఫీసర్ రామ్‌కుమార్, హెచ్‌ఆర్ డీజీఎం రమేష్‌బాబు, రాయబాస్కర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ అని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ ఎస్ఆర్. దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌రావు, స్పెషల్ పిపి. విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బూతాన్ని పారద్రోలి ప్రతీ ఒక్కరు పచ్చని మొక్కలను నాటాలని సింగరేణి ఎస్‌ఓటూ జీఎం, ఇన్‌ఛార్జీ జనరల్ మేనేజర్ ఎస్. కవీంద్ర అన్నారు. గురువారం జీఎం ఆవరణలో ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ఏరియా ఏజీఎం జ్యోతి, ఏరీయా ఇంజనీర్ ఎర్రన్న, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి పాల్గొన్నారు.

● కాటారం : మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుక లు గురువారం ఘనంగా జరిగాయి. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మొక్కలు నాటారు. మండలకేంద్రంలో పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేదం, మొక్కలు నాటితే కలిగే ప్రయోజనంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కాటారం గ్రామపంచాయతీ ఆవరణలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఇతర అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఎఫ్ఆర్వో స్వాతి, పంచాయతీ కార్యదర్శి సమీర్‌ఖాన్, పీఆర్‌ఏ పద్మలత, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, వీవోఏలు, పంచాయతీ సిబ్బంది, ఎఫ్ఎస్‌వోలు చంద్రశేఖర్, అర్చన, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంను ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు బొగత జలపాతం పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రపంచ పర్యావరణంను తెలియజేస్తూ బ్రోచర్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఎస్సై రాజ్‌కుమార్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, సెక్రటరీలు అశోక్, రేఖా తదితరులు ఉన్నారు.

● గోవిందరావుపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం మండల స్పెషలాఫీసర్ జయరాజ్, ఇన్‌చార్జి ఎంపీడీవో జంపాల మమతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, నీటిపారుదలశాఖ శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్ సాయిదుర్గ, పంచాయతీ కార్యదర్శులు భారతి, ఉస్మాన్, సిబ్బంది ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పస్రా పీహెచ్‌సీ ఆవరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్, నాయకులు కొత్త సురేందర్, స్వరూప, రవీంద్రచారి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మెరుగు సత్యనారాయణ, కర్ర సాంబశివరెడ్డి, పసుల బాబూరావు, బైరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● ములుగుటౌన్ : పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఆయన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, వైద్యులు నాగస్వేష్, శకుంతల, భూపాల్‌రెడ్డి, ప్రోగాం మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు, పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సంభవించే వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ రాహుల్‌శర్మ వర్షాకాలంలో వరదలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని రాబోయే వర్షాకాలంలో వచ్చే వరదలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకో వాలన్నారు. మన జిల్లాకు ప్రత్యేక రిజర్వ్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2023 సంవత్సరంలో అత్యధిక వర్షాపాతం నమోదు కావడం వల్ల చెరువులు తెగిపోయి మొరంచపల్లి మునిగిపోవడం జరిగిందన్నారు. గ్రామాల్లో, భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్‌మయాంక్‌సింగ్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, డీఆర్డీఓ, తహసీల్దార్లు,ఎంపీడీఓలు, మునిసిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

క్వారీ వద్ద ఫిర్యాదు నంబర్లు ఏర్పాటు

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీలో అక్రమాలను నిరోధించేందుకు టీజీఎండీసీ అధికారులు కీలక చర్యలు చేపట్టారు. అయితే, ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 31వ తేదీన ప్రచురితమైన "ఏటూరునాగారం ఇసుక క్వారీలో వసూళ్ల దందా", టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు.. అనే కథనానికి టీజీఎండీసీ అధికారులు స్పందించారు. క్వారీలో ఏవైనా అక్రమాలు చోటుచేసుకుంటే తక్షణమే ఫిర్యాదు చేసేందుకు క్వారీ వద్ద ప్రత్యేక కాల్ సెంటర్ నెంబర్లను గురువారం ఏర్పాటు చేశారు. ఏటూరునాగారంలోనే కాకుండా జిల్లాలో కొనసాగుతున్న ప్రతి ఇసుక క్వారీ వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యంలో 155242 కాల్ సెంటర్, 040-23323150 అనే ఫిర్యాదు నెంబర్లను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

సహకార రంగం బలోపేతానికి కృషి చేయాలి

కాటారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):సహకార రంగం బలోపేతానికి అధికారులు, ప్రజలు, రైతులు సమిష్టిగా కృషి చేయాలని కేడీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మీర్జా ఇంతియాజ్ అలీ బేగ్ అన్నారు. గురువారం కాటారం కేడీసీసీ బ్యాంక్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. బ్యాంక్‌లో డిపాజిట్లు, రుణాల వివరాలను తెలుసుకుని ప్రజలకు మరిన్ని సేవలందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 24 బ్యాంక్ శాఖలకు సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరిరామ్, ఎఫ్‌వో రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రజలు, వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. మండలంలోని బొప్పారం సబ్ సెంటర్ పరిధిలోని మద్రిపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డెంగీ, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యులు హారిక , తిరుపతిరెడ్డి, హెచ్‌ఏ సమ్మయ్య, ఏఎన్‌ఎంలు రజిత, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దారెల్లి అమ్మవారి జాతర

వాజేడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుమూరులో జరుగుతున్న దారెల్లి అమ్మవారి జాతర ఘనంగా జరుగుతుంది. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం గురువారం వనం నుంచి అనుమును తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్టించారు. సాయంత్రం జెండా గుట్ట పై నుంచి పెద్ద దేవరను భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చారు. ఆదివాసీల నృత్యాలతో జాతర జరుగు ప్రదేశం సందడి వాతావరణం నెలకొంది.


అనుమును తీసుకువస్తున్న పూజారులు

రోడ్డుకు మరమ్మతులు చేసిన పోలీసులు

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి 163పై నుంచి ఎక్కెల గ్రామానికి వెళ్లే రహదారిని పోలీసులు మరమ్మతులు చేశారు. గురువారం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న రోడ్డుకు మధ్య గుంతలను బీటీ చూర మట్టితో పూర్తిగా పూడ్చివేశారు. ఇక్కడ రోడ్డు దిగే క్రమంలో గుంతలు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సమాజ సేవలో భాగంగా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. పోలీసులు మరమ్మతులు చర్యలు చేపట్టడంతో ఎక్కెల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గొత్తికోయగూడెంలో వైద్య శిబిరం

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్ల కొత్తూరు పరిధిలోని గొత్తికోయగూడెంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు కొండాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ హెచ్. ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేశారు. అనంతరం 38 మందికి అవసరమైన మందులు పంపిణీ చేసి, జ్వర సర్వేలో భాగంగా ఆరుగురికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. దీంతో అందరికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చిందని, వారికి తగిన మందులను అందించామని డాక్టర్ ప్రణీత్ తెలిపారు. గ్రామస్తులకు వేడి చేసిన నీటిని కాచి తాగడం వల్ల కలిగే ప్రయేజనాలను తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఎఎన్‌ఎం సమ్మక్క, భాగ్య, లక్ష్మి పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలైన ముల్కనపల్లి, రేగులపాడు గ్రామాలలో పేరూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి నిత్యం ప్రయాణించే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిర ంలో 28 మంది ఆదివాసీలకు వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరబా దితులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య సూచనలు చేశారు.కార్యక్రమంలో వైద్యాధికారి రాహీల్, హెచ్‌ఏ జయంత్‌లాల్, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

గోవిందరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా జడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకుని పదోతరగతిలో 555మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థిని బెజ్జరబోయిన స్రవంతికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్‌కుమార్ గురువారం రూ.10116లు సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాస్, సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బ క్రాంతికుమార్, సభ్యులు సూడి శ్రీనివాసరెడ్డి, నర్సిరెడ్డి ఏనుగు రవీందర్‌రెడ్డి, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

ఐటీడీఏ సమావేశాన్ని నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పాలక మండలి సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి సురేందర్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో గిరిజనులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బలరామ్, కార్యదర్శి రవీంద్రాచారి, దళిత మోర్చా అధికారి ప్రతినిధి రామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు చక్రవర్తి, మహిళా రాష్ట్ర నాయకురాలు జి. స్వరూప, నాయకులు మహాలక్ష్మి, గంగా తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళిక


ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు

మంగపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) మంగపేట మండల పరిషత్ అభివృద్ధి కార్యలయం లోని సమావేశపుల్లో హాల్లో త్వరలో రానున్న వర్షాకాలంలో వరద ముంపు ప్రాంతాలలో ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం స్థానిక మండల ప్రత్యేక అధికారి సిద్దారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో స్థానిక ఎంపీడీవో బి. భద్రు, ఇన్‌చారీంజ ఎంపీవో సాధుల ప్రభాకర్, స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శ్రీకాంత్ పీఆర్. ఏఈ నిహిత్ పంచాయతి రాజ్ మండల ఏఈ వలీం, ఇరిగేషన్ మండల ఏఈతో పాటు ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు వీవోలు సీసీలు హజరైనారు.

బక్రీద్ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి


ముస్లింలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

మహదేవపూర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : బక్రీదు పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించి పీస్ కమిటీ సమావేశానికి హజరై మాట్లాడారు. హింసకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో పండగను నిర్వహించుకోవాలన్నారు. ఈసందర్భంగా పండగ పర్వదిన శుభకాంక్షలు తెలియజేశారు. ఈసమావేశంలో ఎస్సై పవన్ కుమార్, ముస్లీం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● కాటారం :పజలంతా శాంతి, సామరస్యాలతో మెలగాలని, ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని కాటారం సీఐ నాగార్జునరావు ఆకాంక్షించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వెటర్నరీ వైద్యుడితో కలిసి మైనార్టీ నాయకులు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులతో సీఐ, ఎస్సై సమావేశం నిర్వహించారు. పశువైద్యుడు అధికారికంగా సర్టిఫై చేసిన పశువులను , మేకలను కోయాలన్నారు. శాంతియుతవాతారణంలో పండుగ జరుపుకునేలా అందరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సై అభినవ్, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ రమేష్, బీజేపీ నాయకులు దుర్గం తిరుపతి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లెల్ల శ్రీశైలం, పిలుమర్రి సంపత్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, ముస్లిం మత పెద్ద మీర్జా సిద్ధిఖ్‌బేగ్, మైనార్టీ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్, కరీం, ఖలీల్ తదితరులు ఉన్నారు.

రేషన్ పంపిణీలో సమస్యలు ఉంటే తెలుపాలి


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

గోవిందరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో ఏమైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ అన్నారు. గురువారం ఆయన మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామంలోని రేషన్‌షాపును సందర్శించి కార్డుదారులతో మాట్లాడారు. రేషన్‌షాపుల నిర్వాహకులు కార్డుదారులకు మూడునెలలకు సంబంధించిన బియ్యాన్ని పంపిణీ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి సయ్యద్ ఫైసల్ హుస్సేని, సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నారు.

బీజేపీ ములుగు మండల కార్యవర్గం ఏర్పాటు

ములుగుటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ములుగు మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులుగా లింగంపల్లి రవీందర్‌రావు, ఏరువ పాపిరెడ్డి, గాధం మాధవి, పేరబోయిన హేమాద్రి, ప్రధాన కార్యదర్శులుగా లకావత్ రాజ్‌కుమార్, కుక్కల పవన్‌కళ్యాణ్, కార్యదర్శులుగా గుండబోయిన శ్రీహరి, వేల్పుగొండ రఘువీర్, బద్దుల లక్ష్మి, యాట సాగర్, కోశాధికారిగా వైనాల సం పత్‌లు ఎన్నికయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడు నాగరాజు వారికి నియామకపత్రాలు అందజేశారు. జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి దొంతిరెడ్డి రవిరెడ్డి, గాధం కుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓడవాడకు చెందిన పెద్ద మాంతయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు స్పందించి, మండల పార్టీ నాయకుల ద్వారా మృతుని భార్య మమతకు రూ. 5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఎమ్డీ. ఖాజా పాషా, గండేపల్లి నర్సయ్య, ఎస్.కె ఖలీల్, పర్వతాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని పాడి గేదె మృతి

ఏటూరునాగారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 163వ జాతీయ రహదారిపై గురువారం ఇసుక లారీ ఢీకొని పాడి గేదె మృతి చెందింది. తాళ్లడ్డకు చెందిన పశుపు యజమాని పంజాల కృష్ణకి చెందిన గేదె రోజు వారిగా ఉదయం మేత కోసం వెళ్తూ రోడ్డు దాడుతుండగా, అదే క్రమంలో వాజేడు వైపు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ అతివేగంగా వచ్చి గేదెను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఆ పశువు విలువ రూ. 70 వేలు ఉంటుందని కృష్ణ తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన చెప్పారు.

బాబా ఆలయంలో ఉచిత కంటి పరీక్షలు

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీషరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో 7వ సారి ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేసి, 64 మందిని సర్జరీ, ఆపరేషన్‌కు పంపించామని ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో శంకర కంటి ఆస్పత్రి సిబ్బంది, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, ఆలయ కమిటీ సభ్యులు, సుమారు 70 మంది ప్రజలు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

గోవిందరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గినేని రాము గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ ద్వారా లీటర్ పాలకు రూ.4 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని అన్నారు. విజయ డెయిరీకి రైతులు అందజేసిన పాలకు బిల్లులు 15రోజులకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐఎన్‌టీయూసీ-327తోనే విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారం

గణపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ -327యూనియన్‌తోనే విద్యుత్‌కార్మికుల సమస్యలు సాధ్యమని టీజీ జెన్కో ప్రెసిడెంట్ పిన్నింటి మాధవరావు అన్నారు. ఈ సందర్భంగా జెన్‌కో స్టేట్ సెక్రటరీ జనరల్ శ్రీధర్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జెన్కో గేట్ ఎదుట సంబరాలు చేసుకున్నారు.

తోటి మిత్రుడి కుటుంబానికి చేయూత

చిట్యాల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పిట్టల రాజేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న మిత్రుడు కొంక అశోక్ మిత్రుడి కుటుంబానికి రూ. 50వేలు ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని అందించారు. కాగా అశోక్ దామెర ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు.

బీజేపీ మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

చిట్యాల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ ఉపాధ్యక్ష పదవికి మాచర్ల రఘు రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా నాయకత్వంకు తీసుకెళుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సరైన గౌరవం దక్కడం లేదని జిల్లా నాయకత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్ళిన పట్టించుకోలేదన్నారు. జిల్లా నాయకత్వం చిన్నచూపు చూడడమే తన రాజీనామాకు కారణమని పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

మొగుళ్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తుందనే నెపంతో ఓ బాలికను చంపేందుకు యత్నించిన కేసులో ఇద్దరు నిందితులను గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లు స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని ఓగ్రామానికి చెందిన కుమారస్వామి, రాధల మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుంది. కాగా, రాధ కుమార్తె వివాహేతర సంబంధానికి అడ్డుపడుతుందనే ఉద్దేశం, అమ్మాయిని శారీరకంగా లొంగదీసుకునేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఒప్పుకోకపోవడంతో కుమారస్వామి తోపాటు రాధ అమ్మాయిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని అన్నారు. నిందితులపై పోక్సో , హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుల శేయస్సు కోసం భూ భారతి

మంగపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని ఈ సైట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ టి.రవిందర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పూరేడుపల్లి దోమేడ లోడ్‌గూడెం తదితర గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షతన జరుగగా తహసీల్దార్ రవీందర్ నయాబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావులు హాజరై మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆర్‌ఐలు శ్రీనివాస్ కామేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

మొగుళ్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి, గుడిపాడు గ్రామాల్లో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులు గురువారం కొనసాగాయి. ఈసందర్భంగా తహసీల్దార్ సునీత మాట్లాడు తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

●మల్హర్ : మండలంలోని చిన్నతూండ్ల, శాత్రాజ్‌పల్లిలో గురువారం రెవెన్యూ అధికారులు భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో కలిపి 148, చిన్నతూండ్ల 51, శాత్రాజ్‌పల్లిలో 97 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

● కాటారం : భూభారతి రెవెన్యూ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ధన్వాడ, చిద్నెపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో పలువురు రైతులు, ప్రజలు 507 దరఖాస్తులు పెట్టుకున్నారు. ధన్వాడలో 329, చిద్నెపల్లిలో 178దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ నాగరాజు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్‌ఐ వెంకన్న, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, రెవె న్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు..